క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ హెచ్‌ఆర్ శ్రీనివాసులు

ఆలూరు: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ హెచ్ ఆర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వి.రమాదేవి, ఏరియా ఉపాధి అవకాశాల కోఆర్డినేటర్ వీరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎస్‌బీఐ.బీ ఎంఎస్ కంపెనీల హెచ్‌ఆర్‌లు శ్రీనివాసులు, ఈరన్న హాజరై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 61 మంది నిరుద్యోగ యువతీ, యువకులను ఇంటర్వ్యూ చేశారు. ఇందులో 29 మందిని తమ ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి


ఆస్పరిలో పెద్దయ్యను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని పార్టీ జిల్లా కార్యదర్శిగా నియామితులైన ఆ పార్టీ మండల కన్వీనర్ బిల్లేకల్లు పెద్దయ్య అన్నారు. జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో శుక్రవారం మండల కేంద్రంలో నాయకులు గోవర్ధన, బసవరాజు, ఆశోక్, తిమ్మప్ప, ప్రకాష్, శివ, లక్షన్న, నాయుడు, రాజశేఖర్‌నాయుడు, వీరేంద్ర, సోమన్న, అంజినయ్య ఆయనను ఘనంగా సన్మాంచారు. పెద్దయ్య మాట్లాడుతూ బిల్లేకల్లులో రెండుసార్లు సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందానన్నారు. ప్రస్తుతం తన కుమారుడు శ్రీను బిల్లేకల్లు సర్పంచ్‌గా ఉన్నాడని చెప్పారు.

రోడ్డుపై వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు


మార్కెట్ సముదాయంలో వ్యాపారాలు సాగుతున్న దృశ్యం

మద్దికెర : రోడ్డుపై వ్యాపారాలు నిర్వహిస్తూ వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని పంచాయతీ ఈఓ శివకుమార్, సర్పంచ్ బండారి సుహాసిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన మార్కెట్ సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో రోడ్డుపై సంత నిర్వహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. నాబార్డు, దాతల సహకారంతో రూ.21 లక్షలతో కూరగాయల మార్కెట్ సముదాయాన్ని నిర్మించి వ్యాపారులకు షాపులు కేటాయించామని, వాటిల్లో వ్యాపారాలు నిర్వహించుకోవాలని చెప్పారు. బండారి ఆంజనేయులు ఉన్నారు.

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి


ఎస్‌హెచ్.ఎర్రగుడిలో డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న నూకరాజు

కృష్ణగిరి: నిల్వ నీటిలో ల్వారా ఉత్పత్తిని అరికట్టినప్పుడే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. డ్రై డేలో భాగంగా గ్రామంలో చేపట్టే కార్యక్రమాల గురించి వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి నీటి తొట్లు, డ్రమ్ములను పరిశీలించి అందులో ల్వారా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి తొట్లను వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకుంటే ల్వారాను నివారించవచ్చని చెప్పారు.సర్పంచ్ గిరిబాబు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నిరుపయోగంగా రైతు బజార్

- ప్రారంభం నుంచి ఖాళీగానే షాపులు
- లక్షల వ్యయంతో నిర్మించినా ముందుకు రాని రైతులు, వ్యాపారులు
- రోడ్డుపక్కనున్న పంచాయతీ దుకాణాల్లో కూరగాయల విక్రయాలు
- వ్యాపారులు సుముఖంగా లేకపోవడంతో స్పందించని అన్నదాతలు

పత్తికొండ(తుగ్గలి) : కూరగాయల క్రయవిక్రయాలకు వినియోగదారులు, వ్యాపారాలకు ఇబ్బందులు ఉండరాదని పట్టణంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో 2016–17లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి రూ.70 లక్షలతో రైతు బజార్ నిర్మాణం చేపట్టారు. 2021 జూలైలో అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. రైతు బజార్‌లో 44 షాపులు 3 రూంలు, బాత్రూం, మరుగుదొడ్లు నిర్మించారు. వ్యాపారాలకు సౌకవర్యవంతంగా ఉన్నా షాపులు నిర్వహించేందుకు రైతులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రారంభం నుంచి షాపులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రైతు బజార్ ముందుభాగంలో పంచాయతీ షాపులు రోడ్డు పక్కనే ఉన్నాయి. ఆ షాపుల్లో వ్యాపారులు కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు.

మొదటి నుంచి ఖాళీగానే..

రైతు బజార్ ప్రారంభం నుంచి షాపులు ఖాళీగా ఉంటున్నాయి. వ్యాపారులు కూడా అక్కడ వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రధాన రోడ్డు పక్కన వ్యాపారాలు బాగా జరుగుతాయని, రైతు బజార్‌లో జరగవనే అనుమానంతో వారు ఆసక్తి చూపడం లేదు. దీంతో రూ.70లక్షలతో నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది.

ప్రధాన రోడ్డు పక్కన కూరగాయలు వ్యాపార దుకాణాలు ఉన్నందున రోడ్డుపైనే వాహనాలు ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పైగా ఇక్కడ వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నందున రైతులు రైతు బజార్‌కు వచ్చి అమ్ముకునేందుకు ఆసక్తి చూపడం లేదని పలువురు చెబుతున్నారు. లక్షలతో నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వినియోగం లేక దుకాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించి రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

కూరగాయల క్రయ, విక్రయాలకు ఇబ్బందులు లేకుండా, ఒకే చోట నిర్వహణ సాగేందుకు ప్రభుత్వం రైతు బజార్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో 44 దుకాణాలు, అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. అయినప్పటికీ వ్యాపారులు, రైతులు ముందుకు రాకపోవడంతో 2021 నుంచి దుకాణాలు నేటికీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవడం, వ్యాపారాలు బాగా జరగవనే అనుమానంతో దుకాణాలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది.


ఖాళీగా దుకాణాలు


పత్తికొండ అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన రైతు బజార్

ముందుకు రావడం లేదు



మార్కెట్‌లో రైతులు పంట ఉత్పత్తులు అమ్ముకోవాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ ముందుకు రావడం లేదు. రైతు బజార్ ఖాళీగా ఉండకూడదని వ్యాపారులతో మాట్లాడి షాపులు కూడా కేటాయించాం. అయినా వారు కూడా ఆసక్తి చూపలేదు. రైతు బజార్‌లో రైతులు పంట ఉత్పత్తులు అమ్ముకుంటామంటే షాపులు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నాం.

– ఆర్ కార్నలీస్, మార్కెట్ యార్డు కార్యదర్శి, పత్తికొండ

ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన


ల్యాప్‌ట్యాప్‌లో సర్వే నంబర్లను పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి) : డివిజన్‌లో పది మండలాల ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం నిర్మించతలపెట్టిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం కోసం శుక్రవారం ఆర్డీవో భరత్‌నాయక్ స్థల పరిశీలన చేశారు. పత్తికొండ మండలం దూదేకొండ సమీపంలో పలు సర్వే నంబర్ల వారీగా అవసరం కానున్న 14 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ రమేష్, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో భార్గవ్ ఉన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


పత్తికొండలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

ఎస్టీయూ నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆర్డీవో భరత్‌నాయక్ ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆర్డీవోను కలిశారు. డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్డీవోకు సంఘం నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ బకాయిలు చెల్లించకపోతే చర్యలు


ఏడీఈ సంతోష్‌కుమార్

ఆలూరు: సబ్‌డివిజన్ పరిధిలో వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా వెంటనే నిలిపివేస్తామని ఆలూరు విద్యుత్ శాఖ ఏడీఈ సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఏడీఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హాలహర్వి మండలం మిదేహాళ్ గ్రామ సమీపంలోఉన్న నీరజాక్షి ఐరన్‌ఓర్ హాట్ మిక్చర్ ఫ్యాక్టరీ నుంచి రూ.6 లక్షల బకాయి ఉండటంతో విద్యుత్ సరఫరా నిలిపి వేశామన్నారు. ఇప్పటి వరకు సుమారుగా 50 మందికి పైగా సగం విద్యుత్ బిల్లులను చెల్లించిన వారికి నోటీసులను అందజేశామన్నారు. చింతకుంట, తోగిలతోట, గూళ్యం తదితర గ్రామాల్లో సాగుతున్న విద్యుత్ పనులను త్వరలో పూర్తి చేస్తామని, ఆయా గ్రామాల్లో ఇక నుంచి విద్యుత్ అంతరాయం ఉండదని స్పష్టం చేశారు.

యువకుడి ఆత్మహత్య


కమ్మరి రంగాచారి (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రం వెల్దుర్తిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆశోక్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కమ్మరి తిమ్మయ్య ఆచారి, చిట్టెమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. ఈయన కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు కమ్మరి రంగాచారి (23) పదో తరగతి వరకు చదివి తండ్రి వద్దే నాలుగేళ్లుగా కార్పెంటర్ పని చేస్తున్నాడు. రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండగా తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చూపించారు. అయితే నయం కాకపోవడంతో ఈ నెల 2న రాత్రి ఇంట్లో వాస్మోల్ తాగి పడిపోవడాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వెల్దుర్తిలోని సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మరణించినట్లు ఎస్ఐ వివరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం


మరకట్టులో రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ గోవింద్ సింగ్

ఆలూరు రూరల్: భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మరకట్టు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ అండంగల్ మార్పులు,చేర్పులు, మిగులు భూమి ఆన్‌లైన్ తదితర సమస్యలు 8 అర్జీలు అందినట్లు చెప్పారు రైతులు అందించిన అర్జీలను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ ఎల్లప్ప, సర్వేయర్ అరుణ జ్యోతి , జూనియర్ అసిస్టెంట్ మహేష్, వీఆర్వోలు సత్యనారాయణ,చిదానంద,లోకవీర ఉన్నారు.

హొళగుంద: ఇంగళదహాళ్ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సతీష్ పాల్గొని రైతుల నుంచి 8 అర్జీలు తీసుకున్నారు. వీఆర్‌ఓ నాగరాజు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


సుంకులమ్మ దేవిని దర్శించుకుంటున్న భక్తులు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వెనుక భాగంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సుంకులమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్యామ్ సుందర్ రాజు దొర సహకారంతో నూతన ఆలయం నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు వేద పండితులు ఆధ్వర్యంలో హోమాలు, గణపతి పూజ, కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం వేకువజామున ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు, ఫల,పుష్పాలు అందజేసి పూజలు చేశారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, కృష్ణమూర్తి, బుళ్లి నరసింహులు, వీరస్వామి, ప్రతాప్, కాంట్రాక్టర్ నాగరాజు, వెంకటేష్, మల్లికార్జున గౌడ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆదోని రూరల్: రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 5వ తేదీ జరగనున్న రేషన్ డీలర్ల రాత పరీక్షకు సంబంధించిన కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లోని 78 డీలర్ల నియామకం కోసం 512 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో సరైన పత్రాలు లేనందున 45 దరఖాస్తులను తిరస్కరించినట్లు చెప్పారు. 467 దరఖాస్తులకు హాల్ టికెట్లు మంజూరు చేశామన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో హాల్ టికెట్లు ఇస్తున్నట్లు చెప్పారు. జనవరి 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటల్లోపు పరీక్ష కేంద్రంలో ఉండాలన్నారు. పరీక్షకు ఒరిజినల్ హాల్ టికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలైన గడియారం, క్యాలిక్యులేటర్, మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 1:5 నిష్పత్తి ప్రకారం ఈనెల 6వ తేదీ ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దార్ వలీబాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసీం, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్ ఉన్నారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నేటి తరానికి సావిత్రీబాయి పూలే ఆదర్శం


తుంబళబీడు ఎంపీపీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు,


చిప్పగిరిలో నివాళులర్పిస్తున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పత్తికొండ(తుగ్గలి) : స్త్రీలకు విద్య అవసరమని గుర్తించి దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శమని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన జేఎం తండా పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు కల్యాణిని సన్మానించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి ప్రిన్సిపాల్ మాధురి, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

చిప్పగిరి: మొదటి ఉపాధ్యాయిని సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వరదరాజులు సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. అధ్యాపకులు వసంత,కిరణ్మయి,సరళదేవి,లక్ష్మిని సన్మానించారు.

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం. విజయకుమారి, ఉపాధ్యాయులు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలూరు: కాలానుగుణంగా విద్యలో మార్పులు అవసరమని ఎంఈఓ కోమలాదేవి అన్నారు. మండలంలోని కమ్మరచేడు,మనేకుర్తి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నికల్ ,జెడ్పీ ఉన్నత-1, 2 పాఠశాలలో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు జయంతిని నిర్వహించారు.

ఆలూరు రూరల్: మహిళా విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించిన ఆదర్శమూర్తి సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. శుక్రవారం మండలంలో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తుంబళబీడు గ్రామ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు నాగరాజు, సూర్యనారాయణ, రమణ ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్దికెర : మహిళల హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని శ్రీవిద్యాసాయి కళాశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీవిద్యాసాయి డిగ్రీ కళాశాలలో పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామ జెడ్పీ పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం కృష్ణమూర్తి, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదె రోశన్న ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


జేఎం తండా పాఠశాలలో సావిత్రీ బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఈ

ఉపాధ్యాయులు హెప్సిబా, హేలక్క, ప్రమీల, అనిల్, వెంకటేశప్ప పాల్గొన్నారు.

హొళగుంద: మొదటి ఉపాధ్యాయనిరాలిగా చేసిన సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చిన్నహ్యాట నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సీజనల్ హాస్టల్‌లో ఆమె జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆడపిల్లల చదువు, వారి అభ్యున్నతి గురించి మాట్లాడుకోవాలంటే ముందుగా గుర్తుకి వచ్చేది సావిత్రీబాయి పూలేనని హెచ్‌ఎం గఫూర్ అన్నారు. వెల్దుర్తిలోని సత్యసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఈ ప్రభాకర్‌రాజు, డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మస్తానయ్య స్వామి ఉరుసు

తుగ్గలి : మండలంలోని జీ.ఎర్రగుడిలో వెలసిన మస్తానయ్య ఉరుసును గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా దర్గాకు వెళ్లి చక్కెర చదివింపు చేసి పూజలు చేశారు. దర్గా ప్రాంగణంలో అన్నదానం చేపట్టారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో దర్గాను సందర్శించి స్వామికి పూజలు చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మద్దికెర : చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఏఎన్‌ఎం గాయత్రి అన్నారు. శుక్రవారం అగ్రహారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు కొద్దిసేపు ధ్యానం చేయాలన్నారు. ప్రభుత్వం అందించే భోజనంలో గుడ్డు, చిక్కి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు రహంతుల్లా ఉన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


ఎంపికైన షాజాద్

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన షాజాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు హుసేన్‌బాషా, సబియా తెలిపారు. షాజాద్ కర్నూలులోని శాంతి నికేతన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల అమలాపురంలో జరిగిన అండర్-14 క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించాడు. ఈనెల 23న పాట్నాలో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యాడని చెప్పారు.

దుకాణాల్లో తూనికలు, కొలతల అధికారుల తనిఖీ


బంగారం దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని దుకాణాల్లో తూనికల కొలతల అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. 75 దుకాణాల్లో తనిఖీలు చేయగా 11 దుకాణాలు నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించి రూ.45 వేలు జరిమానా విధించినట్లు తూనికల కొలతల అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాములు తెలిపారు. బంగారం, కిరాణా తదితర దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. దుకాణాల్లో తూనికల్లో రాళ్లకు ముద్రలు లేకపోవడం వల్ల నిబంధనలు అతిక్రమించినందుకు 11 దుకాణాలకు మొత్తం రూ.45 వేలు జరిమానా విధించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాసులు, పరమేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరను ప్రశాంతంగా జరుపుకోండి

కోసిగి: మండల కేంద్రంలో ఈనెల 7, 8వ తేదీల్లో జరగనున్న గ్రామ దేవత దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. శుక్రవారం కోసిగిలోని సిద్ధప్పపాళెం, కింది మారెమ్మ, చింతలగేని మారెమ్మవ్వ దేవాలయాలను కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో దేవర వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ మద్యం తరలించకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నివాళి

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిదానంద (64) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి హర్దగేరి శ్రీనివాసులు, తిప్పారెడ్డి, పెద్దచెన్నప్ప, వీరభద్ర, వీరాదాస్, మండల కో-కన్వీనర్ మల్లికార్జున, కృష్ణ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com